జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ
కరీంనగర్
సోమవారం 22 జనవరి 2024
www.ntnews.com



బాలరాముడి ప్రతిష్ఠకు అయోధ్య ముస్తాబైంది. భవ్య మందిరంలో స్థిరనివాసం ఏర్పర్చుకోవడానికి ముచ్చటైన మూర్తి సిద్ధంగా ఉంది. కౌసల్య నందనుడి నునుపు దేలిన చెక్కిళ్లు చూసి యావత్ భారతం మురిసిపోతున్నది. కృష్ణశిలతో రూపుదిద్దుకున్న నీలమేఘశ్యాముడి మోవిపై అందంగా అమరిన చిద్విలాసాన్ని చూసి జగమంతా తన్మయత్వం చెందుతున్నది. శతాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ అయోధ్యకు ఆగమించిన చారడేసి కన్నులవాణ్ని ప్రపంచమంతా కండ్లప్పగించి చూస్తున్నది. ఆబాలగోపాలం ఆ బాలరాముడిని పదేపదే తలుచుకుంటూ తరిస్తున్న శుభ ఘడియలు ఇవి. ఈ సందర్భంగా కావ్యాల్లో బాలరాముడి లీలావినోదాన్ని ఒకసారి తలచుకుందాం...

# కరుణాలవాల.. బాలరామ!





### అధ్యాత్మ రామాయణంలో..

భోజనం చేసే సమయంలో దశరథుడు కుమారుడి మీద ప్రేమతో 'రామా! రారా!' అని ప్రేమగా పిలిచేవాడు. బిడ్డతో ముద్దులాడాలని ప్రయత్నించేవాడు. కానీ, బాలరాముడు ఆటల్లో పడి తండ్రి దగ్గరికి వచ్చేవాడు కాదు. ఎలాగైనా బిడ్డను తీసుకువచ్చి తండ్రి ఒడిలో కూర్చోబెట్టాలని తల్లి కౌసల్య ప్రయత్నించినా బాలరాముడు పట్టుబడేవాడు కాదు. చివరికి కౌసల్య 'రామా! రామా!' అని ప్రాధేయపడితే అప్పుడు చెంతకు చేరేవాడట. భగవంతుడు ఎంత ప్రయత్నించినా ఎవరికీ పట్టుబడడు. తాను అనుకుంటేనే పట్టుబడతాడు. అందుకే రాముడు నారాయణుడి అంశ.

### రామచరిత మానస్‌లో

ఒకరోజున కౌసల్యాదేవి బాలరాముడికి స్నానం చేయించి, అలంకారం చేసి, ఉయ్యాలలో వేసి పడుకోబెట్టింది. తానూ స్నానం చేసి, దేవతామందిరానికి వెళ్లి పూజ చేసుకుంటున్నది. వంటిల్లు నుంచి నివేదన పదార్థాలు ఒక్కొక్కటిగా తెచ్చి దేవతామందిరంలో పెడుతున్నది. ఒక పాత్ర పెట్టి మరొక పాత్ర వంటింటి నుంచి తెచ్చేసరికి బాలరాముడు ఆ నివేదన తింటున్నట్లు కనిపించింది. రాముడు ఉయ్యాలలో ఉండాలి కదా అనుకుంటూ కౌసల్య గబగబా పరుగెత్తి ఉయ్యాల దగ్గరికి వెళ్తే, అందులో బాలరాముడు గాఢ నిద్రలో ఉన్నాడు. మళ్లీ దేవతామందిరానికి వెళ్లేసరికి అక్కడ నివేదన ఆరగిస్తూ కనిపించాడు.



'కలయో! వైష్ణవ మాయో!' అనుకుంటూ భయంతో కూడిన భ్రమలో మునిగింది కౌసల్య. ఇంతలో రాముడు నవ్వుతూ తల్లిని సమీపించి చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో సకల విశ్వం కౌసల్యకు కనిపించింది. వెంటనే రాముడి పాదాల మీద పడి నమస్కారం చేసింది. తిరిగి రాముడు బాలుడిగా మారి, అమ్మకు ఆనందం కలిగించాడు. తన విశ్వరూపం చూసిన విస్మయం నుంచి కౌసల్యను తప్పించి, పూర్వస్థితికి తీసుకువచ్చాడు. ఈ ఘటన బాలరాముడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అని నిరూపిస్తుంది.

### 'శ్రీరామ కథామృతం'లో..

రామాయణంలో శ్రీరాముడు తాను అవతార పురుషుడినని ఎక్కడా చెప్పుకోలేదు. అలా ప్రవర్తించనూ లేదు. 'ఆత్మానం మానుషం మన్యే.., అహం దశరథాత్మజః'– 'నేను మీ వంటి మనిషినే. దశరథుని కుమారుడను' అని చెప్పుకొన్నాడు. కానీ, రామచంద్రుడిని చూసిన వారందరికీ ఆయన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి రూపంలో కనిపిస్తున్నాడని 'శ్రీరామ కథామృతం' కావ్యంలో తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి ఇలా వర్ణించారు..

క్షీరాబ్ధిశయనుడీ చిన్నికూన యటంచుఁ
బాలబుగ్గల హొయల్బయలుపరిచె
ఫణితల్పమహితుఁడీ పసిపాపఁడంచని
మెత్తని నెమ్మేను మేలుసూపెఁ
గమలాక్షుఁడీ కసుగందు నిక్కంబని
కలికి కన్నుల సోయగంబు దెలిపె
శ్రీనివాసుండె యీ చిరుతబిడ్డడని
క్రొత్తకాంతి మరింత యొత్తిపలికె
సకల సంశయములఁ దీర్పజాల దొక్కొ
విశ్వమోహను సర్వాంగ విలసనంబు
చెలఁగు పురుషోత్తముని భాగ్యచిహ్న మెట్లు
దాచుకొన్నను దాగునే తరలనయన

(బాలకాండ)

'బాలరాముడి పాలబుగ్గలు చూస్తే పాలకడలి మీద పవళించే నారాయణుడు గుర్తుకువస్తున్నాడు. అతని మెత్తని శరీరం ఆదిశేషుడి మీద పవళించే స్వామి ఇతనే అని చెబుతున్నది. బాలరాముడి అందమైన నేత్రాలు మహావిష్ణువు కమలాల వంటి కండ్లను సరిపోలుతున్నాయి. శరీరంలోని అన్ని అవయవాల విలాసం నిస్సందేహంగా ఇతనే విశ్వమోహనుడైన నారాయణుడు అని ప్రకటిస్తున్నది. సాముద్రిక శాస్త్రం ప్రకారం కనిపించే భాగ్యచిహ్నాలు ఇతడే పురుషోత్తముడని స్పష్టం చేస్తున్నాయి' అని వర్ణించారు కవి.

### రామాయణ కల్పవృక్షంలో..

బిడ్డ పుట్టిన 11 రోజుల వరకు అశౌచం పాటించడం మన ఆచారం. కానీ, దశరథుడు తన బిడ్డను ఎత్తుకోకుండా ఉండలేకపోయాడు. పురుటిలోని బిడ్డను ఎత్తుకోగానే బిడ్డ బిగ్గరగా ఏడవడం ప్రారంభించాడు. తల్లి కౌసల్య తీసుకోగానే ఏడుపు మానేవాడు. ఇలా బాలరాముడు తన తండ్రిని పురుటిలోనే ఆటపట్టించాడు. ఇంకోసారి నామకరణ సమయంలో కులగురువైన వశిష్ఠుడు దశరథుడి చేత బియ్యంలో రామచంద్రుడు అని పేరు రాయించాడు. ముహూర్తం సమయానికి ఆలస్యంగా వచ్చిన సుమంత్రుడు బియ్యంలో అక్షరాలు సరిగ్గా కనిపించక రామభద్రుడు అని చదివాడట. ఈ సందర్భాన్ని ఉటంకిస్తూ విశ్వనాథ సత్యనారాయణ 'ధాన్యలక్ష్మి తన రైకలేని రొమ్ము మీద రామ నామాన్ని హత్తుకొన్నది' అని చమత్కరించారు.

... డా|| కప్పగంతు రామకృష్ణ

# మనలోనే అయోధ్య

కాలానికి అందని అభేద్య నగరి అయోధ్య. శ్రీరామచంద్రుడు, అతని తండ్రి దశరథుడికి పూర్వమే అయోధ్యను పరిపాలించిన రాజులెందరో ఉన్నారు. ఇక్ష్వాకు, మాంధాత, హరిశ్చంద్రుడు, సగరుడు, భగీరథుడు, రఘు మహారాజు, అజ మహారాజు మొదలైన చక్రవర్తులెందరో ఈ నగరాన్ని రాజధానిగా చేసుకుని ధర్మబద్ధమైన పాలన చేసి చరిత్రలో చిరయశస్సు పొందారు. వీరందరి కీర్తికి కారణమైన అంశాల్లో అయోధ్య కూడా ఒకటి.

అయోధ్యా మధురా మాయా
కాశీ కాంచీ అవంతికా
పురీ ద్వారావతీ చైవ
సప్తైతే మోక్షదాయికా

దేశంలోని ఏడు ప్రధాన పుణ్యక్షేత్రాలను సప్త మోక్షపురాలుగా పురాణాలు పేర్కొంటున్నాయి. వీటిలో మొదటిది అయోధ్య. యోగ శాస్త్ర ప్రకారం అయోధ్యను మానవశరీరంలో ఉండే సహస్రార చక్రంతో పోలుస్తారు. సహస్రార చక్రం శిరస్సు మధ్యభాగంలో ఉంటుంది. ఇది పరిపూర్ణమైన జ్ఞానానికి ప్రతీక. ఈ చక్రంలో విశ్వచైతన్యం వ్యక్తిచైతన్యంగా ప్రకాశిస్తుంది. ఆత్మజ్ఞానాన్ని సాధించిన పరమయోగులకు మాత్రమే సహస్రార చక్రానికి సంబంధించిన అనుభూతి పూర్వక జ్ఞానం లభిస్తుంది. ఈ స్థానాన్ని తెలుసుకున్న వారికి పునర్జన్మ ఉండదని యోగశాస్త్రం చెబుతున్నది. దీనిప్రకారం అయోధ్యను చేరుకోవటమంటే సహస్రార కమలాన్ని చేరుకోవటం, అంతిమంగా మోక్షాన్ని సాధించడమే!

అందరూ అనుకుంటున్నట్లు అయోధ్య కేవలం నగరం మాత్రమే కాదని, మానవ జీవచైతన్యానికి ఇదొక ప్రతీక అని అధర్వణ వేదం చెబుతున్నది. 'అష్టాచక్రా నవద్వారా దేవానాం పూరయోధ్యా తస్యాం హిరణ్మయః కోశః స్వర్గో జ్యోతిషావృత్తః' ఎనిమిది చక్రాలు, తొమ్మిది ద్వారాలు ఉండే మానవ శరీరం అయోధ్యకు ప్రతీక. శరీరం జనన, మరణ చక్రంలో తిరుగుతూ ఉంటుంది. వీటితో మోక్షం కోసం యుద్ధం చెయ్యటం సాధ్యం కాదు. ఫలితం ఉండదు. శరీరం అనే పట్టణంలోని జ్యోతిర్మయకోశానికి స్వర్గం అనే పేరుంది. అది జీవచైతన్య స్వరూపమైన తేజ




స్సుతో నిండి ఉంటుంది. అయోధ్య పట్టణాన్ని ఏ వ్యక్తి బ్రహ్మ సంబంధమైనదిగా తెలుసుకుంటాడో అతనికి బ్రహ్మదేవుడు ఆయువు, కీర్తి మొదలైన వాటిని అనుగ్రహిస్తాడని అధర్వణ వేదమంత్రాలు చెబుతున్నాయి. వాక్యపరంగా 'అయోధ్య' పదానికి ఉన్న అర్థాన్ని శరీరానికి అన్వయిస్తే జయించటానికి సాధ్యం కాని లక్షణం ఉన్న శరీరమే అయోధ్యకు లౌకిక ప్రతీకగా నిలుస్తుంది. మొత్తంగా మనలో ఉన్న ఆత్మచైతన్యాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకతను అయోధ్య నిరంతరం గుర్తుచేస్తుందని అర్థం చేసుకోవాలి.

... శ్రీ భారతి

# రమ్యం.. రామం

ఒక మనిషికి ఉండే శక్తి ఎంతటిదో నిరూపించిన వాడు శ్రీరాముడు. తన జీవన యానంతో ప్రత్యక్షంగా కొందరికి, రామాయణ కావ్యంతో అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలిచిన సకల గుణాభిరాముడు రామచంద్రుడు. అందుకే 'రామాదివత్ వర్తితవ్యం న రావణాదివత్' – శ్రీరాముడిలా జీవితాన్ని కొనసాగించాలి, రావణుడిలా కాదు అనే ఉపదేశం మనకు వాఙ్మయంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.



కోసల రాజ్య ప్రజలందరూ తమ దైనందిన వ్యవహారాల్లో, పరస్పర సంభాషణల్లో శ్రీరాముడి ప్రస్తావనే పదేపదే తెచ్చేవారట. అంతఃపురంలో బాలరాముడికి ఏదైనా వేడుక జరిగితే.. ప్రజలంతా కూడా పండుగలా భావించి, తమ ఇంట సంబురాలు చేసుకునేవారట. శ్రీరాముడు గుణవంతుడు, రూపసౌందర్యవంతుడు, వీరుడు, దృఢవ్రతుడు, చిరునవ్వుతో– ప్రేమతో అందరితో ఆప్యాయంగా మెలిగేవాడు. కోపాన్ని జయించిన వాడు, సామాన్యులనే కాదు.. రాక్షసులను, దేవతలను, ప్రకృతిలోని నదులను, వృక్షాలను కూడా ఆకర్షించగల తేజస్సు కలవాడు. ఆర్థిక వ్యవహారాల్లో, రాజ్యాధికార విషయాల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగనివాడు. తన పరాక్రమంతో దేవతలను కూడా జయించగల సమర్థుడు... ఇలా సకల సద్గుణవంతుడిగా రాముడు కీర్తిప్రతిష్ఠలు అందుకున్నాడు. తాను పొందిన ప్రతీ ఉపకారాన్ని గుర్తుంచుకునేవాడు.

రామరాజ్యంలో ఎవరి ఇంట్లో శుభకార్యం జరిగినా.. ఖజానా నుంచి వారికి బహుమతులు పంపేవాడట రాముడు. అందుకే ఆయన సర్వజనామోదం పొందిన పాలకుడు అయ్యాడు. వానరులు, మహర్షులు, స్త్రీలు, పురుషులు, బాలురు అందరూ ముక్తకంఠంతో ఏకగ్రీవంగా రాముడి వ్యక్తిత్వాన్ని, సత్యనిష్ఠను, ధర్మనిరతిని, ఆదర్శవంతమైన జీవన విధానాన్ని కీర్తించేవారు. రామబాణంతో దెబ్బతిన్న మారీచుడు, ముక్కుచెవులు కోల్పోయిన శూర్పణఖ, యుద్ధభూమిలో చతికిలపడ్డ రావణుడు మొదలైన రాక్షస పరివారం కూడా రాముడి గుణాలను పొగిడిన వారే. శ్రీ రాముడి వ్యక్తిత్వం ఎంత ప్రసిద్ధి పొందిందంటే... యుగాలు దాటినా ఇప్పటికీ బిడ్డలకు జన్మనిచ్చే తల్లులు శ్రీరాముడి లాంటి గుణవంతుడే తమకు సంతానంగా రావాలని కోరుకుంటారు. కన్యలంతా తమకు రాముడి లాంటి భర్త దొరకాలని మొక్కుకుంటారు.

.. సముద్రాల శఠగోపాచార్యులు
98483 73067

# పట్టాభిరాముడి పాలన సూత్రాలు..

రామ బాణానికి తిరుగు లేదు. రామ నామానికి ఎదురులేదు. రామ పాలనకు ఉపమానం లేదు. అస్త్రశస్త్రాల మీద ఆయనకున్న పట్టు అమోఘమని రామాయణంలో అనేక ఘట్టాల్లో రుజువు అవుతుంది. పాలనపై ఆయనకున్న అవగాహన ఎంతటిదో.. తనను అయోధ్యకు తీసుకువెళ్లడానికి అడవికి వచ్చిన భరతుడితో మాట్లాడే సందర్భంలో తెలుస్తుంది. భరతుడిని కుశల ప్రశ్నలు అడుగుతూ.. పాలన ఎలా ఉండాలో తెలియజేస్తాడు. ప్రభువు ఎలా మసులుకోవాలో వివరిస్తాడు. మంత్రిమండలి కూర్పు ఎలా ఉండాలో విశదపరుస్తాడు.



- పాలకుడి దగ్గర ఉండే అమాత్యుడు ఎక్కువ నిద్రపోయే వాడై ఉండకూడదు. ప్రతి విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. రాజ్య రహస్యాలను ఎన్నడూ బయట పెట్టకూడదు. రాజకీయ, ఆర్థిక శాస్త్రాలు సంపూర్ణంగా తెలిసి ఉండాలి. పాలకుడికి కానీ, ఆయన చుట్టూ ఉన్న మంత్రులు, అధికారులకు కానీ.. ఎదుటి వారిని చూడగానే వారి మనసు అంచనా వేయగలిగే శక్తి ఉండాలి.
- రాజు రైతుల పక్షపాతిగా ఉండాలి. ఏ కారణం వల్లనైనా రైతులు పన్నులు చెల్లించలేకపోతే.. శిస్తు కట్టమని వారిని బలవంతం చేయొద్దు. ఈ విషయంలో పొరపాటు జరిగితే ప్రజల నుంచి అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.
- సైనికులకు ప్రాధాన్యం ఇవ్వాలి. దేశభక్తి ఉన్న వారిని, మేధావులను, ప్రభుత్వంపై అభిమానం ఉన్నవారిని గౌరవించాలి.
- పాలకుడు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దు. ప్రతి విషయాన్నీ జాగ్రత్తగా పరిశీలించి.. ఆంతరంగికులతో చర్చించాకే ఒక నిర్ణయానికి రావాలి. గత పాలకుల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలి.

# దేవదేవుని దేవకీదేవి కనగా..




మన పోతన మధురిమ 157 వ భాగం

'దేవకీ కాంత విశ్వగర్భ గర్భయగుచు'.. విశ్వగర్భుడు విష్ణువు అర్భక (శిశు) రూపంలో గర్భస్థుడై ఆవిర్భవించే ప్రతి సందర్భంలో హిరణ్యగర్భునికి (బ్రహ్మదేవునికి) ఆయనను స్తోత్రం చేయడం అభ్యాసం– ఆనవాయితీ. 'నేను అవతరించి అవనీ (భూ) భారాన్ని అంతరింప చేస్తా' అని ఇచ్చిన మాటను సత్యం చేసినందులకు ఆనందించి బ్రహ్మరుద్ర నారదాది అమరులు నిత్య విభూతి స్వరూపుని నారాయణుని సత్య పరాయణునిగా అత్యంత భక్తి శ్రద్ధలతో స్తుతించారు... స్వామీ! అసత్యమైనదైనా సత్యంగా తోచు ఈ ప్రపంచానికి నీవే అంతర్యామివి– చైతన్య ప్రదాతవు, అధిష్ఠానం– ఆధారం. 'అనేకంగా కనిపించే ఈ లోకాలన్నీ, ఓ పన్నగశాయీ! నీ కన్నా భిన్నంగా లేనే లేవు' అని విన్నవిస్తూ ద్వైత ప్రపంచాన్ని వృక్షరూపంగా నిరూపిస్తున్నారు...

సీ|| 'ప్రకృతి యొక్కటి పాదు ఫలములు సుఖదుఃఖ
ములు రెండు గుణములు మూడువేళ్లు
తగు రసంబులు నాల్గు ధర్మార్థముఖరంబు
లెఱిఁగెడి విధములైదింద్రియంబు
లారు స్వభావంబు లాశోకమోహాదు
లూర్మలు ధాతువు లొక్కయేడు
పైపొర లెనిమిది ప్రంగలు భూతంబు
లైదు బుద్ధియు మనోహంకృతులును'
తే|| 'రంధ్రములు తొమ్మిదియుఁ గోటరములు ప్రాణ
పత్ర దశకంబు జీవేవ పక్షియుగము
గలుగు సంసార వృక్షంబు గలుఁగజేయ
గావ నడగింప రాజ వొక్కరుడ వీవ'

'ఆది దేవా! సమష్టి (బ్రహ్మాండ), వ్యష్టి (పిండాండ) రూపమైన ఈ అనాది సంసారం ఆదివృక్షం. ఎప్పటికైనా అసంగ– వైరాగ్యమనే గొడ్డలిచే అడ్డంగా నరకబడేది కాన వృక్షం.. ఎలాంటిది? దీనికి ప్రకృతియే పాదు. సుఖదుఃఖాలనేవే ఫలాలు. సత్త్వ, రజః, తమోగుణాలు మూలాలు– వేళ్లు. ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే నాలుగు పురుషార్థాలు రసాలు. పంచ జ్ఞానేంద్రియాలు వీనిని గ్రహించే సాధనాలు. షడూర్మలు– ఆకలి దప్పికలు, శోకమోహాలు, జరా (వృద్ధాప్య) మరణాలు– ఈ ఆరూ వృక్ష స్వభావం. సప్త ధాతువులు.. త్వక్ (చర్మం), రక్త, మాంస, మేద (కొవ్వు), అస్థి, మజ్జ (మూలగ), శుక్ర (వీర్య)ములే చెట్టు బెరడు. పంచభూతాలు, మనో బుద్ధి అహంకారాలు– ఈ ఎనిమిదీ కొమ్మలు. నవ ద్వారాలు ఈ తరువుకు ఉన్న తొమ్మిది తొర్రలు. పది ప్రాణాలు (ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయములు) ఆకులు. జీవుడు, ఈశ్వరుడు– వీరిద్దరూ ఈ వృక్షం మీద ఉండే పక్షులు. (ముండక ఉపనిషత్తులో 'ద్వాసుపర్ణా సయుజా సఖాయా' అని జీవ, ఈశ్వరులను రెండు పక్షులుగానే పేర్కొనడం జరిగింది. శరీరమనే వృక్షంలో హృదయమనే గూటిలో జీవుడు, ఈశ్వరుడు అనే రెండు పక్షులున్నాయి. రెంటిలో ఒకటి (జీవపక్షి) ఫలభోక్త– పుణ్యపాప కర్మల ఫలములైన సుఖదుఃఖాలను అనుభవిస్తూ ఉంటుంది. మరొకటి (పరమాత్మ) ఏమీ తినకుండా సాక్షియై చూస్తూ ఉంటుంది. అయినా జీవపక్షి కన్నా అధిక ఐశ్వర్య సంపన్నంగా ఉంటుంది). ఇట్టి విచిత్రమైన సంసారమనే చెట్టును పుట్టించడానికి, పెంచడానికి మరల తుంచివేయడానికి పురుషోత్తమా! ఎంచగా నీవే ఏకైక ఏలికవు– ప్రభువువి! మూలంలోని 'ఏకాయనోఽసౌ' అనే శ్లోకానికి శ్రీధరుని టీక– వ్యాఖ్యానం కూడా మేళవించి చాలా మేలిమి (విశదం)గా తెనిగించాడు అసదృశ (సాటిలేని) కవి, పుణ్యశ్లోకుడు– పవిత్ర చరితుడు పోతన. బ్రహ్మాది దేవతలు ఇంకా ఇలా వేడుకొన్నారు... పద్మనాభా! నీ పుట్టుకతో ఈ పుడమి భారం తొలగిపోతుంది.



కం|| 'మచ్చిరి యున్నది లోకము
నిచ్చలుఁ గంసాది ఖలులు నిర్దయు లేచన్
మచ్చిగఁ గావగఁ వలయును
విచ్చేయుము తల్లి కడుపు వెడలి ముకుందా!'

'కంసాది ఖలులు– దుష్టులు క్రూరంగా కష్టాల పాలు చేస్తుంటే ఈ లోకమంతా శోకంలో మునిగి ఉంది. ముకుందా! మచ్చిక (ప్రేమ)తో లోకాన్ని రక్షించడానికి మాతృకుక్షి– తల్లికడుపు నుంచి వెంటనే బయటికి విచ్చేయవయ్యా'. 'ముంచ కుంచ దదాతి ఇతి ముకుందః'– ఇహపరా (భుక్తిముక్తు)లను ఇచ్చువాడు ముకుందుడు. దేవతలు దేవకీదేవిని.. 'తల్లీ! నీ ఉదరంలో పదిలంగా ఉన్న దామోదరుడు– నల్లనయ్య ఎల్లి– రేపే పుట్టబోతున్నాడు. కంసుని వల్ల నీకిక ఏ భయమూ లేదు. మా మాట కల్లకాదు. ఈ నాటి నుంచి మాకెల్లవారికి మేలు కలుగుతుంది. యాదవులందరూ ఆదమరచి మోదం (సంతోషం)తో ఉప్పొంగుతున్నారు. అమ్మా! ఎల్లవేళలా నీ కడుపు చల్లగా వర్ధిల్లాలి' అని దీవించి విరించి, విరూపాక్షాదులతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

**శుకుడు పరీక్షిత్తుతో... రాజా!**

కం|| 'పంకజముఖి నీళ్లాడను
సంకటపడ ఖలుల మానసంబుల నెల్లన్
సంకటము దోఁచె మెల్లన
సంకటములు లేమి దోఁచె సత్పురుషులకున్'

పంకజం– పద్మం లాంటి ముఖం కలిగిన దేవకి ప్రసవించడానికి సంకట (వేదన) పడుతుంటే, దుష్టుల ఉల్లము (మనస్సు)లలో ఏదో ఆవేదన పెల్లుబికింది. మంచివారికి సంకటాలు– కష్టాలు, మెల్లగా తొలగుతున్న సూచనలు తొంగిచూశాయి.

దేవకీదేవి దేవదేవుని కంటూ ఉండగా... ఏడుసముద్రాలు మింటికెగసి (ఉప్పొంగి)నాయి. మాధవుని ఆగమనాన్ని మోదంతో చాటుతున్నట్లు పయోదాలు– మేఘాలు ఉరిమాయి. గగనం గ్రహ, తారకలతో ఘనంగా వెలిగింది. దిక్కులన్నీ దివ్యకాంతుల వెల్లువలతో పిక్కటిల్లాయి– నిండాయి. చల్లగాలులు కమ్మని వాసనలతో మెల్లగా వీచాయి. అర్ధరాత్రి మహర్షుల ఆశ్రమాలలోని హోమకుండాలలో ధూమధ్వజుడు– అగ్ని జాజ్వల్యమానంగా వెలిగాడు. తామరపూలతోను, వాటిపై జుం జుం అంటూ తిరుగాడే తేట్ల– తుమ్మెదలతోను కొలనులు కళకళలాడాయి. నదులన్నీ నిర్మలమైన జలంతో నిండుగా పారాయి. ఇలా (భూ)దేవి ఆనంద విలాసాలతో ఉల్లాసభరితంగా ఉంది. పక్షుల కిలకిలారావాలతో, పుష్కలంగా ఫల పుష్పాలతో ఉద్యానవనాలు, కాననాలు (అరణ్యాలు) పులకరించాయి. అమ్మ దేవకి కొమరుని కంటూ ఉండగా అమరులు మురిపాలతో సుమ (పుష్ప) వర్షం కురిపించారు. గంధర్వులు తమ గుండెలలో బరువులు దిగిపోగా దరువులు వేస్తూ ఆనందంతో పాటలు పాడారు. రంభాది అప్సరసలు నాట్యాలు ఆడారు. సిద్ధులు, చారణులు భయం వీడి ఒక చోట గుమిగూడారు. దేవతల దుందుభులు మ్రోగాయి.

అది హర్షపులకితమైన వర్షరుతువు. కల్యాణప్రదమైన శ్రావణ మాసం. కృష్ణ పక్షం! స్వపక్షం! శుక్లపక్షాన్ని అందరూ ఆదరించి అభిలషిస్తారు. కాని, కృష్ణపక్షాన్ని అనుగ్రహించి అక్కున చేర్చుకోవడం వృష్ణి వంశ శిరోరత్నమైన కృష్ణునికే చెల్లింది. అష్టమి తిథి. తిథులకు సంధి– మధ్య తిథి. రెండు పక్షాలలో అష్టమి చంద్రుడు అష్టకళలతో సమరసంగా– సమానంగా ఉంటాడు. కాన, 'సమచంద్రుడు' అని పేరు. పరమాత్మ హాని వృద్ధి రహితుడు అని ధ్వని! అష్టమి చంద్రుడు ఆలస్యంగా పన్నెండు గంటలకు ఉదయిస్తాడు. బుధవారం, యోగులకు మిక్కిలి ప్రియమైన రాత్రి సమయం. పన్నెండు గంటల అభిజిత్ లగ్నం! శుకముని– రాజా! సర్వ శుభగుణ యుక్తమైన పరమ శోభన ముహూర్తం ఆసన్నమైంది. రోహిణి నక్షత్రం రోదసిలో ఓజస్సుతో అతి సౌమ్యంగా ఉంది. చంద్రవంశంలో అవతారం కాన, చంద్రునికి అతి ప్రియమైన సతి రోహిణి కనుక, హరి దానినే తన జన్మ నక్షత్రంగా వరించాడు.

కం|| 'సుతుఁగనె దేవకి నడురే
యతి శుభగతిఁ దారలును గ్రహంబులు నుండన్
దితిసుత నిరాకరిష్ణున్
శ్రిత వదనాలంకరిష్ణు జిష్ణున్ విష్ణున్'

ఇలా తారా, గ్రహగణాలు అన్నీ ధారాళంగా శుభస్థానాలలో ఉండగా సతి దేవకీదేవి కారాగృహంలో అర్ధరాత్రి అతి ప్రసన్నుడైన వెన్నుని– విష్ణుని సుతునిగా కన్నది. అతను దితి సుతులను– దైత్యులను, తునుమాడే (ఖండించే)వాడు. అతణ్ని ఆశ్రయించే వారి ముఖాలు ఆనందంతో వెలిగిపోతాయి. దేవకి మేను (దేహం) మెరుపు తీగలాగ దేదీప్యమానంగా ప్రకాశించింది. పున్నమి నాడు నిండైన ఉడురాజు– చంద్రుడు ఉదయించగానే కడు శోభతో వెలిగే తూర్పు దిక్కువలె దేవకి విరాజిల్లింది! 'కను' అనునది తెలుగులో చాలా వింతపదం. దీనికి చూడటం, ప్రసవించడం అని రెండు అర్థాలు. ఈ ప్రసంగంలో ప్రసవించడం కాక చూడటమనే అర్థం. విశ్వగర్భునికి గర్భవాసం లేదు. అజ్ఞానమనే గాఢ అంధకారంలో ఉజ్జ్వల దివ్య విజ్ఞాన ప్రకాశోదయం– శ్రీకృష్ణచంద్రోదయం.



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)